క్లుప్తంగా

చంద్రకళకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగం పరిశోధకురాలు గుజ్జేటి చంద్రకళకు ఆ యూనివర్సిటీ మంగళవారం డాక్టరేట్ ప్రకటించింది. ప్రొడిజియాసిన్ ఎ పొటెన్షియల్‌సోర్స్ ఫర్ టెక్స్‌టైల్ అండ్ బయోమెడికల్ అప్లికేషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వరంగల్ పాపయ్యపేటకు చెందిన చంద్రకళకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ విభాగం ప్రొఫెసర్ శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో చంద్రకళ పీహెచ్‌డీ పూర్తిచేశారు. చంద్రకళ ప్రస్తుతం వాగ్దేవి కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. తన పరిశోధనలో భాగంగా సెరెటియ సర్వాటెంట్ ఫెషియన్స్ అనే బ్యాక్టీరియాను ఆమె గుర్తించారు. దాని నుంచి వచ్చే వర్ణద్రవ్యాన్ని ఔషధరంగం, వస్త్రపరంగంలో ఉపయోగించవచ్చని చంద్రకళ కనుగొన్నారు.

బిడ్డా బాగున్నావా?

- ఎంపీ కావ్యకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పలకరింపు

హన్మకొండ కల్చరల్: 'బిడ్డా బాగున్నావా' అంటూ వరంగల్ ఎంపీ కడియం కావ్యను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆప్యాయంగా పలకరించారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయాన్ని ఎంపీ కావ్య సందర్శించారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో దయాకర్‌రావుకు కావ్య ఎదురుపడటంతో ఇరువురు పరస్పరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకొని కొంతసేపు సరదాగా ముచ్చటించారు.

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఆత్మహత్య

హసన్‌పర్తి: మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నేత ఆకుల అశోక్ (50) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అశోక్ అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యం తీసుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది అర్వపల్లిలోని తన ఇంటిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దిలీప్, నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు మదన్, భగత్, నాయకులు కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు ఘన స్వాగతం



హసన్‌పర్తి: సిద్దిపేట నుంచి హనుమకొండకు వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎర్రగట్టు గుట్ట వద్ద బీఆర్ఎస్ నాయకులు బుధవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సతీష్‌బాబు, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరెడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, గిన్నారపు రవి, మాజీ ఎంపీపీ కొండపాక సుకన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తా సమీపంలోని విశాల్ మార్ట్ వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ నుంచి భూపాలపల్లికి ఒడితల గ్రామానికి చెందిన మండల శేఖర్, గణేష్, ఒడిశాల శ్రీకాంత్ ఆటోలో వెళ్తుండగా, జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు.. ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలైయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

భక్తులకు పండ్ల పంపిణీ



హసన్‌పర్తి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ –303 డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ బూర రాంచందర్, అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్, డిస్ట్రిక్ట్ ప్రతినిధులు పోలసాని రాంచెందర్, పావుశెట్టి శ్రీధర్, కుమార్, అసోసియేషన్ కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శివయ్యా..సల్లంగ సూడయ్య

మహా శివరాత్రి పర్వదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. వేలేరు గట్టు మల్లన్న దేవాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆత్మకూరులో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో పాటు వివిధ మండలాల్లోని ఆలయాల్లో ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శివపార్వతుల కల్యాణం జరిపించగా భక్తులు తిలకించారు. శివయ్య సల్లంగ సూడయ్య అంటూ వేడుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



వేలేరు : కల్యాణ ఘట్టంలో భాగంగా తాళి చూపిస్తున్న అర్చకులు



పరకాల : పూజల్లో పాల్గొన్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి



కమలాపూర్ : క్యూలైన్‌లో భక్తులు



శాయంపేట : పూజల్లో పాల్గొన్న సిరికొండ..



వేలేరు : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీహరి



దామెర : దామేశ్వరాలయంలో..

పరకాల : కుంకుమేశ్వరాలయంలో..





ఎల్కతుర్తి : వంగరలో..



ఎల్కతుర్తి : వంగరలోని కైలాసకల్యాణి క్షేత్రంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



ఆత్మకూరులో..



ధర్మసాగర్ : క్యూలైన్‌లో భక్తులు

ఆలయ అభివృద్ధికి దాతల సాయం



వేలేరు : మండలంలోని కమ్మరిపేట గ్రామంలో గల అతిపురాతనమైన రామలింగేశ్వర స్వామి ఆలయానికి వేలేరు గ్రామానికి చెందిన బిల్లా యుగేందర్ రూ.50వేల విలువ చేసే బోర్ మోటార్, పైప్‌లను అందించారు. జర్పుల రాజు, బాదావత్ సమ్మయ్య గర్భగుడిలో గ్రానైట్ స్టోన్, గూటం వీరస్వామి మంచినీటి ట్యాంక్‌ను కట్టించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ (ఫైల్)

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన 106 ఏళ్ల శతాధిక వృద్ధురాలు జక్కుల మల్లమ్మ బుధవారం మృతిచెందారు. మల్లమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 28 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మల్లమ్మ బుధవారం ఉదయం వరకు ఆరోగ్యంగా ఉంటూ తన పనులు తానే చేసుకునేది. ఆమె మృతిచెందడంతో గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

గీత కార్మికుడికి గాయాలు

వర్ధన్నపేట : కట్ర్యాలకు చెందిన గీత కార్మికుడు చెంగల శ్రీనివాస్ బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కళల కాణాచి ఓరుగల్లు



జ్యోతిప్రజ్వలన చేసిన తన్నీరు హరీశ్‌రావు, తదితరులు

- మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్
- ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం
- అలరించిన సాంస్కృతిక నృత్యాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

హన్మకొండ కల్చరల్: కళల కాణాచి ఓరుగల్లు అని, కళావైభవాన్ని ప్రపంచానికి చాటుదామని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో బుధవారం రాత్రి ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి అధ్యక్షతన ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులతో పాటు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీష్‌బాబు, నన్నపునేని నరేందర్, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, ఆధ్యాత్మిక ప్రవచకులు ప్రణావనంద దాసు, జొన్నవిత్తుల రామలింగేశ్వర్, సీఎస్ రంగరాజన్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నెర్రలుబారిన నేలకు నీళ్లు తెప్పించిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. వివిధ రంగాలకు చెందిన కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించారు. కూచిపూడి, పేరిణి, శివతాండవం నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ముస్లింల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



ఎన్నికైన నూతన కార్యవర్గం

న్యూశాయంపేట: ముస్లిం, మైనార్టీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ సుభాన్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో గ్రేటర్ వరంగల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఈక్రమంలో పార్టీలకు అతీతంగా, కలిసికట్టుగా అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. జనాభాకు అనుగుణంగా తమకు రావాల్సిన వాటా కోసం ప్రభుత్వాలతో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రేటర్ పరిధిలోని అన్ని పార్టీల నాయకులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ.సుభాన్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ ఖుద్దూస్, కోశాధికారిగా అఫ్జల్ మొహినొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మీర్జా అజీజ్ బేగ్, బాబా ఖాద్దర్‌వల్లీ, మున్నాభాయ్, అబీబ్ ఖాన్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ షకీల్, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా మహ్మద్ జుబేర్, మొహినొద్దీన్ ఎన్నికయ్యారు.

ప్రధాన రహదారిపై అంధకారం

- వంగపహాడ్ – మల్లారెడ్డిపల్లి మార్గంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు



వంగపహాడ్ - మల్లారెడ్డిపల్లి ప్రధాన రహదారి

హసన్‌పర్తి: వంగపహాడ్ మల్లారెడ్డిపల్లి ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రాత్రివేళలో ఈ రోడ్డుపై అంధకారం అలుముకుంటోంది. ప్రధాన రహదారిపై వీధి దీపాలు లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హసన్‌పర్తి మండలంతో పాటు పరకాల దామెర, నడికుడ మండలాలకు చెందిన ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఈ మార్గంలో రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు రద్దీగా ఉంటోంది.

నాలుగు నెలల్లో నలుగురి దుర్మరణం

నాలుగు నెలల్లో ఈ రోడ్డుపై నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. రాత్రి వేళల్లో రహదారి కనిపించకపోవడం వల్ల వాహనాలు పరస్పరం ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు లేని కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయి.

వీధి దీపాలు, స్పీడ్ బ్రేకర్లు లేవు

ఈ రోడ్డు ఇరువైపులా వీధి దీపాలతో పాటు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వ్యక్తమవుతోంది. దీంతో ప్రమాదాలు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఆ దిశగా చొరవ చూపాలని కోరుతున్నారు.

హనుమకొండకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు



నిరుపయోగంగా శాయంపేట బస్‌షెల్టర్



మాందారిపేట స్టేజీ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



విద్యుత్ దీపాలు లేక అంధకారంలో మాందారిపేట బస్‌షెల్టర్

- మండలానికి రాని హనుమకొండ బస్సు
- ప్రైవేటు వాహనాల్లో స్థానికుల ప్రయాణం
- గంటల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



మాందారిపేట స్టేజీ వద్ద బస్సు కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు

శాయంపేట : మండలానికి హనుమకొండ బస్సు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్ ఉన్నప్పటికీ శాయంపేట నుంచి హనుమకొండకు బస్సు సౌకర్యం లేక స్థానికులు ఆటోలో మాందారిపేట వరకు వెళ్లి అక్కడ బస్సుల కోసం గంటల తరపడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉదయం నాలుగు గంటల నుంచి ప్రతి గంటకు ఒక బస్సు చొప్పున రాత్రి తొమ్మిది గంటల వరకు బస్సులు వచ్చేవి. నాలుగేళ్ల క్రితం మండలం నుంచి హనుమకొండకు బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. దీంతో ప్రజలు, మండలంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఇబ్బందులకు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మాందారిపేట స్టేజీ వద్ద బస్సులు ఆగేది లేదు

పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులు మాందారిపేట స్టేజీ వద్ద ఆపకుండా వెళ్లడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాయంపేట నుంచి ప్రైవేటు వాహనాల్లో మాందారిపేటకు వచ్చి వేచి చూస్తున్నామని, బస్సు డ్రైవర్లు మాత్రం స్టేజీ వద్ద ఆపడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు క్రమం తప్పకుండా మాందారిపేట స్టేజీ వద్ద ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాత్రి అయితే అంధకారమే

మాందారిపేట బస్ షెల్టర్ అంధకారంగా మారింది. మాందారిపేట నుంచి హనుమకొండకు, పరకాలకు వెళ్లే ప్రయాణికులు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు అక్కడ కూర్చోలేక రోడ్డు పక్కనే నిల్చోని బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో చీకటి అలుముకుంటోంది. రాత్రి వేళలో బస్ షెల్టర్‌కు వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇప్పటికైనా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి బస్ షెల్టర్‌లో సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



శాయంపేట నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల్లో మాందారిపేటకు వెళ్లి బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులు మాందారిపేట స్టేజీ వద్ద ఆగడం లేదు. ప్రతి బస్సు మాందారిపేట స్టేజీ వద్ద ఆపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కందగట్ల హైమావతి, శాయంపేట

ప్రభుత్వాలు మారినా సమస్య తీరలేదు



రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పటికీ హనుమకొండ నుంచి శాయంపేటకు బస్సు సౌకర్యం కల్పించకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినప్పటికీ మండలం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ చూపి బస్సు సౌకర్యం కల్పించాలి.

– సాంబయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

మార్కండేయ ఆలయంలో కువైట్ డిప్యూటీ అంబాసిడర్ పూజలు

వరంగల్ చౌరస్తా / వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని మార్కండేయ దేవాలయంలో ఇండియాకు చెందిన కువైట్ దేశంలో భారత ఎంబసీలో డిప్యూటీ అంబాసిడర్ ములుక సంజయ్ కుమార్ (ఐఎఫ్ఎస్) బుధవారం శివరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు. వరంగల్ రామవారి వీధికి చెందిన సంజయ్‌కుమార్ తాజాగా వరంగల్‌కు వచ్చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ ఆలయం విశిష్టతను తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట గుండేటి సతీష్ కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నేత్రపర్వం.. మల్లికార్జునుడి కల్యాణం



నందివాహనంపై మల్లికార్జునుడు

ఐనవోలు : మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతియేటా నిర్వహించే భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ముందుగా ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ, వీధులగుండా భక్తుల కోలాటాలు, భజనలతో నంది వాహనంపై ప్రదక్షిణ చేసి కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. కాగా ఆలయం తరఫున ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు–వసంత దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, కల్యాణ తలంబ్రాలు సమర్పించారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో అష్టోత్తర శత(108) కలశలచే గర్భాలయంలోని శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అంతకుముందు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు–మధుమతి దంపతులు మల్లికార్జునుడిని దర్శించుకున్నారు. మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్ దంపతులు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, నరేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గద్దె కూలగొట్టారని రైతుల ఆందోళన



హసన్‌పర్తి: విద్యుత్ అధిక భారాన్ని తగ్గించడానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొట్టిన సంఘటన హసన్‌పర్తి మండలం నాగారంలో చోటుచేసుకుంది. నాగారం శివారులోని సూదన్‌పల్లి ఎస్ఎస్ –2 ట్రాన్స్‌ఫార్మర్‌పై సుమారు 45 మోటారు కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు ఆరువందల ఎకరాల వరకు అక్కడ సాగవుతోంది. విద్యుత్ లోడ్ అధికం కావడంతో విద్యుత్ సమస్య ఏర్పడింది. ఈక్రమంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ కోసం రెండు రోజుల క్రితం గద్దెను ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రే ఆ గద్దెను కూల్చివేశారు. దీంతో రైతులు ఆందోళనకు దిగి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.